క్లుప్తంగా...

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కౌంటర్ దాఖలు

మేడ్చల్: మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు-545లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో స్కూల్ కోసం కేటాయించిన స్థలం అన్యాక్రాంతంపై గ్రామ కార్యదర్శి కలెక్టర్ ఆదేశానుసారం మేడ్చల్ న్యాయస్థానంలో కేసు నమోదు చేశారు. గ్రామ పరిధిలోని 545బీ సర్వే నంబర్‌లో వెంచర్ చేయగా అందులో 1,720 గజాల స్థలాన్ని పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తన భార్య విజయలక్ష్మీ పేరు మీద తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు కార్యదర్శి న్యాయస్థానంలో కౌంటర్ దాఖలు చేశారు. స్థలంపై ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయరాదని రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత జాబితాలో చేర్చారు.

యూజీడీ పనులు ప్రారంభం



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపిక

మేడ్చల్: పట్టణంలోని 5వ వార్డులో(ఎన్జీవోస్ కాలనీ)లో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక పారంభించారు. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాలువ నిర్మాణ పనులను కౌన్సిలర్ నర్సింహయాదవ్‌తో కలిసి ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. 5వ వార్డు అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆర్టీసీ బస్‌పాసుల పంపిణీ



ఎదులాబాద్‌లో బస్ పాసులను అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థినులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా ఆర్టీసీ బస్ పాసులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై బస్‌పాసులను అందజేశారు. మశ్చేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రభంజన్, వీరారెడ్డి, కృష్ణగౌడ్, శివ సాయి, ఉపేందర్, శివకుమార్, బస్వరాజ్, ప్రవీణ్‌రెడ్డి, ఆర్టీసీ ప్రతినిధి రాంచందర్‌యాదవ్ పాల్గొన్నారు.


ఈటలకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే ఈటలను కలిసిన పట్టణ బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ ఎన్నికల కమిటీ నిర్వహణ అధ్యక్షుడిగా హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించడంతో బీజేపీ నాయకులు ఆయనను సత్కరించారు. పూడూర్ పరిధిలోని ఈటల నివాసానికి నాయకులు వెళ్లి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈటల రాజేందర్‌ను కలిసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, ప్రేందాస్, కేశవరెడ్డి, నాయకులు ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కీసర: అంకిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు బుధవారం బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి సింగారం నారాయణ తన పుట్టిన రోజును పురస్కరించుకొని విద్యార్థులకు ఉచితంగా 800నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్కురి మహేష్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు శ్యాంప్రసాద్, టీచర్స్ కరుణకుమారి, రేణుక, లక్ష్మీ, నేతలు రాధకృష్ణ, రమేష్, రమేష్‌గౌడ్, మల్లేష్, కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ఏదీ శ్రద్ధ..?

అస్తవ్యస్త పరిసరాల్లో తినుబండారాల తయారీ

- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత
- నాణ్యతమైన పదార్థాలు అందించడంలో విఫలం
- కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం
- తనిఖీలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజారోగ్యంపై అశ్రద్ధ ప్రాణాల మీదకు తెస్తోంది.. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రత తమ పరిధిలో లేదన్నట్లు, అది తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. పురపాలక సంఘాల్లోని పలు కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనడంలో సందేహం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినా నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. చేతులకు రక్షణ కవచాలు(తొడుగులు)వేసుకోకుండానే ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు.

◆ కల్తీ నూనె, ప్రమాదరకమైన రంగులు..

ఆహార పదార్థాల తయారీలో భాగంగా వంటకాల్లో వాడిన నూనెనే తిరిగి వాడుతుండటంతో ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. కొంతమంది కల్తీ నూనెల్లోనే ఆహార పదార్థాలను వండుతున్నారు. ఎలాంటి రక్షణ లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్, వెజ్ మంచూరియాల తయారీలో ఎరుపు రంగులు వాడుతున్నారు. మిగిలిపోయిన వాటిని ఫ్రిడ్జ్‌ల్లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నుంచి వెలువడే పొగతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు, తోటి వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కూతవేటు దూరంలో పురపాలక సంఘాల కార్యాలయాలు ఉన్నా.. తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

◆ హెల్త్ ఆఫీసర్ల పట్టింపేదీ..?

గ్రేటర్ శివారు జిల్లాల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు 614 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో మెజారిటీ పురపాలక సంఘాలు, జీపీల్లోని మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. పురపాలక సంఘాల్లోని మాంసం దుకాణాలపై హెల్త్ ఆఫీసర్ల పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవడంతో ఫ్రిడ్జిల్లో రెండు, మూడు రోజుల పాటు ఉంచిన మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు. దీంతో పట్టణవాసులు రోగాల బారిన పడుతున్నారు.

◆ పర్యవేక్షణ కరవై..

గ్రేటర్ శివారుల్లో పెరుగుతున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ కొట్లకు అనుగుణంగా ఆహార భద్రతాధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోందని తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఆహార భద్రతాధికారి పోస్టు ఖాళీగా ఉంది. పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కరువైంది. హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించని వారిపై..

వర్షాకాలం ఆరంభంతో తినుబండారాల తయారీ కేంద్రాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్ ఆగస్త్య పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత పాటించేలా నోటీసులు అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించే బాధ్యత ఆహారభద్రత శాఖాధికారులు చేపట్టాల్సి ఉందన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా ఇంటింటి విచారణ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్ఓ చంద్రావతితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు 18ఏళ్లు నిండిన వారిని చేర్పించడంలో బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించటంతో పాటు ఓటుహక్కు వినియోగంలో అవకతవకలు అరికట్టడంపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించిందన్నారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీకి బూత్‌స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాస్ మూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

8న ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 8న భారత ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లపై సంబంధిత శాఖలు అధికారులతో ఆయన చర్చించారు. 8న హకీంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ చేరుకుంటారని, అందుకు సంబంధించి జిల్లా అధికారులు హకీంపేటలో తగిన ఏర్పాట్లతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రధానమంత్రి పర్యటనలో ప్రోటోకాల్‌ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు రవి, మల్లయ్య, డీఎఫ్ఓ జానకిరామ్, డీఎస్ఓ తనూజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ సీఐగా నర్సింహరెడ్డి



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నర్సింహ సంజయ్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ సీఐగా విధులు నిర్వర్తించిన రాజశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో మేడ్చల్ ట్రాఫిక్ సీఐగా కొనసాగుతున్న నర్సింహరెడ్డిని మేడ్చల్ సివిల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న రాజశేఖర్ రెడ్డి ఈ మేరకు బుధవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో నూతన్ సీఐ నర్సింహరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు, సిబ్బంది నూతన సీఐకి స్వాగతం పలికి బదిలీపై వెళ్తున్న రాజశేఖర్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం మేడ్చల్ సీఐ నర్సింహరెడ్డి మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



నూతన సీఐకి స్వాగతం పలుకుతూ బదిలీపై వెళ్తున్న సీఐకి వీడ్కోలు పలుకుతున్న పోలీస్ సిబ్బంది

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి చెక్కులు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిహారికకు రూ.60 వేలు, ప్రభాకర్‌కు రూ.22,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కౌన్సిలర్లతో కలిసి కుటుంబీకులకు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చేది ఎంత?

- రూ.4 వేలా.. రూ.5 వేలా..?
- అయోమయం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మేడ్చల్: కాంగ్రెస్‌లో నిత్యం కుమ్ములాటలు ఉంటాయని ఆ పార్టీని అనుసరించే అందరికీ తెలుసు. ఆ పార్టీ ఒకమాట చెబితే నాయకులు మరో మాట చెబుతూ ప్రచారాలు చేసుకుంటున్నారు. ఖమ్మం జనగర్జన సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ తాము తెలంగాణలో అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ప్రకటన చేయగా అదే విషయాన్ని రేవంత్‌రెడ్డి నుంచి కోమటిరెడ్డి వరకు అందరూ ప్రస్తావించారు. దీనికి భిన్నంగా మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.5 వేలు ఇస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అనుచరులు గోడలపై కేఎల్ఆర్ జిందాబాద్ అని వాల్ రైటింగ్‌లు రాస్తూ తాము అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ.5వేల పింఛన్, రూ.500 గ్యాస్ సిలిండర్ అని గోడపై రాసి జోరుగా ప్రచారం చేస్తున్నారు. అధిష్ఠానం రూ.4 వేల పింఛన్ అంటే నాయకులు రూ.5 వేల పింఛన్ అనడం కాంగ్రెస్ నాయకులకే చెల్లింది.



ఐడియాథాన్ విజేత అనురాగ్ విద్యార్థి



ఏయూలో విజేతను అభినందిస్తున్న సీఈఓ నీలిమా

ఘట్‌కేసర్: ఐడియాథాన్ విజేతగా నిలిచి రూ.లక్ష బహుమతి గెలుపొందిన వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ కంప్యూటర్స్ సైన్స్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థి గడ్డం రోహిత్‌ను యూనివర్సిటీ (ఏయూ) సీఈఓ నీలిమా బుధవారం అభినందించారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ సౌజన్యంతో ఉస్మానియా, టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యూబేటర్, ఫైన్‌హోప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక స్థితిని అభివృద్ధి చేసేందుకు ఐడియాథాన్‌ను నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలాక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు ఖుషీ అనే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చాట్‌బాట్‌ను రూపొందించారు. కార్యక్రమంలో డీన్ విష్ణుమూర్తి, బలరాం, శివప్రశాంత్, రవీందర్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు



ఎన్ఎఫ్‌సీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్



నారపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్:మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్‌తో కలిసి బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, మల్లేష్, ఆంజనేయులు, అనురాధ, రైతు బంధు మండల కో ఆర్టినేటర్ అంజిరెడ్డి, జిల్లా సభ్యుడు మంకయ్య, కీసరగుట్ట డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత కౌన్సిలర్ అరెస్ట్ అక్రమం..

దళితవాడ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా 12వ వార్డుపై వివక్ష చూపుతున్న మంత్రి మల్లారెడ్డి వైఖరిని నిరసిస్తూ నిరసన చేపట్టిన దళిత కౌన్సిలర్ మేకల పద్మారావును పోలీసుల అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీపీఎం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. బుధవారం పట్టణంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి సబిత మాట్లాడుతూ దళిత వార్డుకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం, దళిత కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయించామని మంత్రి తెలిపారు. అనంతరం ఘనాపురం గ్రామ పంచాయతీ 6వ వార్డు మెంబర్ మయూరి మహేందర్‌తో పాటు 50 మంది కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, నల్లవెల్లి లక్ష్మి, సామల శ్రీలత, మోటుపల్లి పోచమ్మ, బద్దం మమతారాణి, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు అడిగితే.. ఫోన్ గుంజుకున్నారు

మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి మల్లారెడ్డిని తమకు దళిత బంధు ఎందుకు ఇవ్వడం లేదని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పకు చెందిన డప్పు సురేష్ బుధవారం ప్రశ్నించారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఇలాంటి ప్రశ్నలు ఏమిటంటూ పోలీసులు సురేష్ ఫోన్ గుంజుకున్నారు. దీంతో అతను ఆవేదనకు గురై కాలనీలో పలుమార్లు డప్పు ప్రకటన చేస్తూ పోలీసుల తీరుపై ధ్వజమెత్తారు.

మంత్రి మల్లారెడ్డికి నిరసన సెగ

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మంత్రి మల్లారెడ్డికి బుధవారం నిరసన సెగ తగిలింది. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన మంత్రిని 12వ వార్డు కౌన్సిలర్ మేకల పద్మారావు అడ్డుకున్నారు. శిలాఫలకం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున మంత్రి నిధులను ఇచ్చారు. దళిత కౌన్సిలర్ అని కావాలనే నిధులివ్వకుండా అవమానించాడని ఆరోపించాడు. ఆందోళన చేపట్టిన కౌన్సిలర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పద్మారావు మంత్రి మల్లారెడ్డి డౌన్ డౌన్.. దళితులపై మంత్రి నిరంకుశ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్‌గా ఎన్నికైనప్పటి నుంచి పైసా కేటాయించలేదని, బీఆర్ఎస్‌లోకి రాలేదని వివక్ష చూపుతున్నారని, దళిత కౌన్సిలర్ అని పైసా కేటాయించడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించిన రూ.1.7 కోట్లలో దళితవాడ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా కావాలనే మంత్రి అడ్డుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు.



ఘట్‌కేసర్‌లో శిలాఫలకం ఎదుట బైఠాయించి మంత్రితో వాగ్వాదం చేస్తున్న దళిత కౌన్సిలర్ పద్మారావు

కాంట్రాక్టర్ కొట్టాడనే ఆత్మహత్య

- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన మృతురాలి కుటుంబ సభ్యులు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పెద్ద చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కంపెనీలో కాంట్రాక్టర్ కొట్టడంతో మనస్తాపం చెంది కార్మికురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేడ్చల్ పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో నివాసం ఉండే స్వప్న(19) మంగళవారం మేడ్చల్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విధితమే. కాగా మేడ్చల్ పారిశ్రామికవాడలోని రాణే ఇంజన్ వాల్స్ కంపెనీలో పనిచేస్తున్న స్వప్న కంపెనీ క్యాంటిన్ కాంట్రాక్టర్ కొట్టడం వల్లే ఆత్మహత్యకు పాల్పడిందంటూ కుటుంబీకులు, బంధువులు బుధవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మూడేళ్లుగా నిత్యం డే డ్యూటీ చేసే స్వప్నను ఈ నెల 3వ తేదీన క్యాంటీన్ చూసుకునే ఓ మహిళ నైట్ డ్యూటీకి రావాలని కోరింది. డ్యూటీ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా ఆగ్రహానికి గురైన కాంట్రాక్టర్ కార్మికురాలు స్వప్నను గదిలో బంధించి కొట్టింది. దీంతో మనస్తాపానికి గురైన స్వప్న 4వ తేదీన గుడికి వెళ్తున్నానంటూ ఇంట్లో నుంచి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. తమ కూతురు మృతికి క్యాంటిన్ కాంట్రాక్టర్ కారణమంటూ మృతురాలి కుటుంబీకులు, బంధువులు మేడ్చల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ మేరకు గదిలో బంధించి వాగ్వాదం చేస్తున్న వీడియోలు, మృతురాలు స్వప్న దురుసుగా మాట్లాడటమే కొట్టడానికి కారణమని కాంట్రాక్టర్ ఇతరులతో చెప్పే వీడియోల ఆధారంగా మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మేడ్చల్ పోలీస్‌స్టేషన్ వద్ద మృతురాలి కుటుంబీకులు, బంధువులు